సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం : 16 ఏప్రిల్ : 2025



కుటుంబాన్ని గుర్తుచేసుకోవాలి

యువత వాహనాలు నడిపేటప్పుడు తమ కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలని సినీ నటుడు బాబూమోహన్ పేర్కొన్నారు. - 8లో



నత్తనడకన కొనుగోళ్లు

ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించి పక్షం రోజులు గడిచినా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోవడం లేదు. - 9లో



దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని, దళారులను నమ్మవద్దని మార్కెట్, పీఏసీఎస్ చైర్మన్లు అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

నేడు దిశ సమావేశం

భువనగిరిటౌన్ : జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అమలు తీరు, వివిధ శాఖలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై సమావేశంలో సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు 2024 జూలై నుంచి 2025 మార్చి 31వరకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

ముగిసిన పదో తరగతి మూల్యాంకనం

భువనగిరి : పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారం ముగిసింది. మార్చి 21నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరిగాయి. ఈనెల 7వ తేదీన బీబీనగర్ మండలం గూడూరు పరిధిలోని బీర్ల ఓపెన్ మైండ్ స్కూల్‌లో సమాధాన పత్రాలను మూల్యాంకనం ప్రారంభించారు. మూల్యాంకానికి 1,60,997 సమాధాన పత్రాలు వచ్చాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు 781 మంది ఉపాధ్యాయులను నియమించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా మూల్యాంకనం ముగిసిందని డీఈఓ తెలిపారు.

దూదివెంకటాపురం హెచ్‌ఎంకు అవార్డు



ఉత్తమ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం బట్టి స్వరూప

రాజాపేట : మండలంలోని దూదివెంకటా పురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యారాలు బట్టి స్వరూప జాతీయ ఉత్తమ టీచర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, తెలంగాణ ఫిలిం క్లబ్ చైర్మన్ రామకృష్ణ, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేశారు.

నృసింహుడికి సంప్రదాయ పూజలు



ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం సాయంత్రం వెండి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. అదే విధంగా ప్రధానాలయం, విష్ణుపుష్కరిణి వద్ద క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు.

న్యాయమూర్తుల బదిలీ

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు జడ్జిలు మంగళవారం బదిలీ అయ్యారు. ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద మెదక్ నుంచి సూర్యాపేటకు బదిలీ అయ్యారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి పి.ముక్తిదా ఎల్బీనగర్ నుంచి యాదాద్రి జిల్లా మొదటి అదనపు కోర్టుకు బదిలీ అయ్యారు. మొదటి అదనపు కోర్టు జడ్జి డాక్టర్ ఎం.శ్యాం శ్రీ సూర్యాపేట నుంచి సికింద్రాబాద్ ఫ్యామిలీ కోర్టుకు బదిలీ అయ్యారు.



రామన్నపేట మండలం నీర్నెముల గ్రామ సమీపంలో వడగండ్ల వానకు రాలిన వడ్లు



రైతన్నకు కడగండ్లు

రామన్నపేట : రామన్నపేట మండలంలోని నీర్నెముల, నిధానపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగాయి. ధాన్యం నేలరాలింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యంలో వర్షపు నీరు చేరింది. నీటిని తోడేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి.



నిధానపల్లి కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యంపై పేరుకుపోయిన వడగండ్లు

రూ.3 కోట్లు వెనక్కి!

- సద్వినియోగం చేసుకోవడంలో వైద్యారోగ్య శాఖ విఫలం
- గడువు ముగియడంతో వెనక్కి పోయిన నిధులు
- ఆస్పత్రుల అభివృద్ధి, మరమ్మతులు, వసతుల కల్పనకు ఇబ్బందులు
- ఉన్నతస్థాయి సూచన మేరకు సొంత డబ్బులు ఖర్చు చేస్తున్న వైద్యాధికారులు
- తిరిగి చెల్లించకుండా జాప్యం



సాక్షి, యాదాద్రి : నిధులు లేక కొన్ని శాఖలు నీరసిస్తుంటే ఉన్న నిధులను ఉపయోగించుకోలేని దుస్థితిలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఉంది. ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలు అందించేందుకు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా నిధులు వస్తుంటాయి. ఇందులో భాగంగా జిల్లాకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ రూపాల్లో సుమారు రూ.3 కోట్లు విడుదలయ్యాయి. వీటిని సకాలంలో సద్వినియోగం చేసుకోకవడంతో వెనక్కివెళ్లాయి. దీంతో వైద్యాధికారులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ ఆస్పత్రులు, వచ్చిన నిధులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు(సీహెచ్‌సీ), జిల్లా కేంద్ర ఆస్పత్రికి రూ.43.87 లక్షలు వచ్చాయి. ఇందులో సీహెచ్‌సీలకు రూ.18.01 లక్షలు, పీహెచ్‌సీలకు రూ.25.86 లక్షలు కేటాయించారు. ఒక్కో పీహెచ్‌సీకి రూ.1,23,158, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రికి రూ.4,50,310 ఇచ్చారు. ఈ నిధులను ప్రధానంగా మరమ్మతులు, గోడలకు కలర్స్, ఫర్నిచర్ కొనుగోలు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, తాగునీటి సౌకర్యం తదితర వాటికి వినియోగిస్తారు. నిధులను మార్చి 31లోపు ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ, వినియోగించకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఫలితంగా ఆస్పత్రుల్లో మరమ్మతులు, మెటీరియల్ కొనుగోలు, మౌలిక సౌకర్యాల కల్పనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

'కంటివెలుగు' సిబ్బంది రెండేళ్లుగా ఎదురుచూపులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కంటి వెలుగు పథకంలో పని చేసిన సిబ్బందికి రెండేళ్లయినా వేతనాలు రాలేదు. ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.75,000 పైగా రావాల్సి ఉంది.

ఎల్‌సీడీసీకి రూ.9.30 లక్షలు విడుదల

కుష్టు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా వ్యాధిని గుర్తించేందుకు లెప్రసీ కేస్ డిటెక్షన్ కేంపెయిన్ (ఎల్‌సీడీసీ) కోసం రూ.9,30,150 విడుదలయ్యాయి. మార్చి 15నుంచి 30 వరకు 15 రోజుల పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎల్‌సీడీసీ కార్యక్రమాలు నిర్వహించారు. కానీ, అందుకు అవసరమైన నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో వెనక్కి వెళ్లాయి.

హెచ్‌డీఎస్ ఫండ్ రూ.6లక్షలు మళ్లింపు

హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ(హెచ్‌డీఎస్) నిధులు రూ.25.85లక్షలు విడుదలయ్యాయి. వీటని ఆస్పత్రుల అభివృద్ధి కోసమే వినియోగించాల్సి ఉంది. కానీ, ఇందులో రూ.6లక్షలు చౌటుప్పల్‌లోని పాలియేటివ్ కేర్ సెంటర్‌కు మళ్లించారు. మిగతావి వెనక్కి వెళ్లాయి.

ఎన్‌క్యూఏఎస్ సంస్థ రూ.2.40 కోట్లు ఇచ్చినా నిష్ప్రయోజనం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్‌క్యూఏఎస్) సంస్థ గత ఏడాది మార్చి 20న రూ.2.40 కోట్లు విడుదల చేసింది. ఇందులో ఒక్కో పీహెచ్‌సీకి రూ.3 లక్షల చొప్పున కేటాయించారు. కానీ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఆస్పత్రులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఇవి కూడా వెనక్కి వెళ్లాయి.

వైద్యులకు అందని డబ్బులు!

ఆస్పత్రుల్లో మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ముందు సొంత డబ్బులు వెచ్చిస్తే ఆ తరువాత చెల్లిస్తామని ఇటీవల నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో జిల్లా వైద్యాధికారి సూచించారు. కానీ వైద్యులు ఖర్చు పెట్టిన డబ్బుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.

టెట్ దరఖాస్తుల స్వీకరణ

- ఈ నెల 30 వరకు అవకాశం
- జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు

భువనగిరి : తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉంది. జూన్15 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయనున్నారు.

దరఖాస్తులు పెరిగే అవకాశం

చివరిసారి 2024 జనవరిలో టెట్ నిర్వహించగా జిల్లా నుంచి 3 వేలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ వేస్తామని ప్రభుత్వం చెబుతుండడంతో ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. పరీక్ష ఫీజు ఒక పేపర్‌కు రూ.750, రెండు పేపర్లకు రూ.1000 నిర్ధారించారు. బీఈడీ చేసిన వారు రెండు పేపర్లు రాసే అవకాశం ఉంటుంది.

తాగునీటి సమస్య రావొద్దు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి

- వేసవి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : వేసవిలో ఎక్కడా మంచినీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు ఎక్కడైనా సరే.. ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమై తాగునీరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. భూ భారతి పోర్టల్ అమలుపై దిశా నిర్దేశం చేశారు. తాగునీటి కోసం నియోజకవర్గానికి కోటి రూపాయల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. తాగునీటి సమస్య ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. చేతిపంపులకు మరమ్మతులు చేయాలని, అవసరమైన చోట బోర్లు వేసి మోటార్లు బిగించాలని, ప్రైవేట్ బోర్లు అద్దెకు తీసుకోవాలని పేర్కొన్నారు. పల్లెనిద్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు మూడు నెలల్లో పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇసుక ఇబ్బందులు రాకుండా చూడాలని, సిమెంట్, స్టీల్ తక్కువ ధరకు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతనంగా మంజూరు చేయనున్న ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, లబ్ధిదారుల జాబితాలు ఇందిరమ్మ కమిటీ ఆమోదం పొందిన తరువాత ఎమ్మెల్యేల సమక్షంలో జిల్లా ఇంచార్జి మంత్రి మంజూరు చేస్తారని చెప్పారు. బేస్మెంట్ పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1 లక్ష జమ చేస్తున్నట్లు తెలిపారు. భువనగిరి, బీబీనగర్, కొండమడుగు, పోచంపల్లి, జిబ్లక్‌పల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లలో గృహప్రవేశం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ కరుణాకర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు,మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన తప్పనిసరి

ధరణి పోర్టల్ స్థానంలో ప్రభుత్వం తీసుకువచ్చిన భూ భారతి చట్టపై రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈనెల 17నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని, చట్టంలోని అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్, కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ప్రతిగ్రామంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. మే 1నుంచి ప్రతి మండలంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలు అందజేయనివారుంటే ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలి

- పద్మశ్రీ డాక్టర్ ఏఎస్ నారాయణ



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఏఎస్ నారాయణ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్

సంస్థాన్ నారాయణపురం : మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థిక సాధికారత సాధించాలని పద్మశ్రీ డాక్టర్ ఏఎస్ నారాయణ సూచించారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ ఎంబ్రాయిడరీ శిక్షణ పూర్తి చేసుకున్న 45 మంది మహిళలకు రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి సమకూర్చిన రూ.3 లక్షలు విలువ చేసే కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అదే విధంగా సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి శిక్షణ పూర్తి చేసుకున్న 75 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్ నారాయణ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. మానవత్వం, సమానత్వం, ప్రేమతత్వం బోధించిన సాయినాథుని స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.కిషోర్‌రెడ్డి, రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి, సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ఫ్యాషన్ డిజైనర్ కృష్ణమూర్తి, ఎస్ఐ జగన్, సెర్ప్ ఏపీఎం యాదయ్య, సామాజిక కార్యకర్తలు పర్ని శివారెడ్డి, సుక్క సుదర్శన్, సాయి ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధి చిలువేరు హరిప్రసాద్, ప్రవాస భారతీయ విద్యార్థులు తేజ, త్రిష, శ్రీరామలక్ష్మి, ట్రైనర్ వినోద పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో తిరువీధి సేవ

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో మంగళవారం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తిరువీధి సేవ వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఆలయంలో సుప్రబాత సేవ, తోమాలసేవ, సహస్ర నామార్చన, నిత్య కల్యాణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



తిరువీధి సేవను ఊరేగిస్తున్న అర్చకులు

ఉత్తమ సాగు విధానాలతో అధిక దిగుబడి



సాగు విధానాలపై వ్యవసాయ విద్యార్థినులు, రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త అనిల్‌కుమార్

మోటకొండూర్: ఉత్తమ వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, అధిక లాభాలు పొందాలని ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మోటకొండూరులో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం భువనగిరి ఆధ్వర్యంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. భూసారం పెంచడం, సేంద్రియ విధానాల వల్ల లాభాలపై వివరించారు. రైతులు కాలానికి అనుగుణంగా సాగులో మార్పులు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మధుశేఖర్, ఏఓ రమాదేవి, స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి, రమ్య, హన్సికారెడ్డి, చందనారెడ్డి, ఎల్లారెడ్డి, కంచి మల్లయ్య, సిద్దారెడ్డి, మల్లేష్, ఐలయ్య, వెంకటేశ్వ రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై అప్రమత్తం



వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్యారోగ్య శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడగాలులతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, చిన్నారులు
- జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు

భువనగిరి : రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలుల తీవ్రత వల్ల వృద్ధులు, చిన్నారులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ మిషన్ డైరెక్టర్ ఎన్‌హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఎండ దెబ్బ తగలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. ఇందుకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎండ దెబ్బ తగలకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ తయారీ విధానంపై మెడికల్ ఆఫీసర్లకు ఈ నెల 15వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం గ్రామస్థాయిలో సదస్సులు ఏర్పాటు చేసి ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, బుక్‌లెట్లును సిద్ధం చేశారు.

అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

జిల్లాలో 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక ఏరియా ఆస్పత్రి, జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అదే విధంగా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, బస్టాండ్ ఆవరణలో అందుబాటులో ఉంచడంతో పాటు ఓఆర్‌ఎస్ తాగే విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

ఐదు శాఖల ఆధ్వర్యంలో కమిటీలు

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మొత్తం ఐదు శాఖల సమన్వయంతో కార్యచరణ చేపట్టారు. మండలస్థాయిలో ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రభుత్వంనుంచి వచ్చిన ప్రచార పోస్టర్ల ద్వారా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలు, వృద్ధులు, చిన్నారులు, ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. అధిక ఉష్ణోగ్రత వల్ల ఇబ్బందులు వచ్చినప్పుడు 108కు కాల్‌చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దు

ఎండ తీవ్రత పెరుగుతోంది. వృద్ధులు, చిన్నారులు, కూలీలపై ప్రభావం పడుతోంది. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లరాదు.

– మనోహర్, డీఎంహెచ్‌ఓ



పాదయాత్ర

వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కోసం వలిగొండ మండలం వేములకొండ మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్ట వరకు మంగళవారం బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, భిక్షమయ్యగౌడ్, గాదరి కిశోర్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు -వలిగొండ

క్లుప్తంగా

యాదగిరీశుడిని దర్శించుకున్న సంగీత దర్శకుడు కోటి



సంగీత దర్శకుడు కోటికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని ప్రముఖ సంగీత దర్శకుడు కోటి(సాలూరి కోటేశ్వరరావు) మంగళవారం స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఆలయ పునర్నిర్మాణం, స్వర్ణ విమాన గోపుర విశిష్టతను కోటికి ఈఓ వివరించారు.

నిచ్చెనపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



పాండరి (ఫైల్)

రాజాపేట: నిచ్చెనపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన రాజాపేట మండలం సింగారం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. సింగారం గ్రామానికి చెందిన చెన్నూరి పాండరి (60) తాను ఉంటున్న భవనంపై ఉన్న పాత సామగ్రి తీయడానికి కట్టెలతో తయారు చేసిన నిచ్చెన వేసుకొని భవనం పైకి ఎక్కుతుండగా.. ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రాజాపేట ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం ఓ పశువుల కాపరి పశువులు మేపుతుండగా వేప చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని కనిపించడంతో వెంటనే రైల్వే స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చాడు. స్టేషన్ మాస్టర్ మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్లు ఉంటుందని, రెండు రోజుల క్రితమే ఉరేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద తెల్లటి చొక్కాలో సికింద్రాబాద్ నుంచి సెరామ్ (కర్నాటక)కు రైలు టికెట్ లభించిందని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు 8712670189, 8712670151 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బోరు మోటారు చోరీ

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం షాపల్లి గ్రామ శివారులో రైతు కన్నెబోయిన శ్రీను వ్యవసాయ బావి వద్ద బోరు మోటారును ఈ నెల 10వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ మేరకు మంగళవారం నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. గతంలో సైతం గ్రామ చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్ద 20కి పైగా బోరు మోటార్లు, 6 స్టార్టర్‌లు చోరీకి గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ సభ

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



పాదయాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, యాదాద్రి, వలిగొండ: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. రజతోత్సవ సభ విజయవంతం చేయాలని మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి యాదగిరిగుట్ట క్షేత్రం వరకు బీఆర్ఎస్వీ, యువజన విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరంగల్ సభ తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందన్నారు. ప్రజలంతా మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. ప్రజలను ఎక్కడికక్కడ పీక్కుతింటున్న కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తన్ని తరిమే రోజులు వచ్చాయన్నారు. ఇవాళ రాష్ట్రంలోని ప్రజలకు కష్టం వస్తే మా దేవుడు కేసీఆర్ ఉంటే బాగుండు అని అనుకుంటున్నారన్నారని అన్నారు. వేములకొండ నుంచి వలిగొండ, భువనగిరి మీదుగా యాదగిరిగుట్ట వరకు ఈ పాదయాత్ర మూడురోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేష్, బీఆర్ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, కొలుపుల అమరేందర్, సురకంటి వెంకట్‌రెడ్డి, పనుమటి మమతానరేందర్‌రెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, డేగల పాండరి, వల్లమాల కృష్ణ, బూరుగు నవీన్‌గౌడ్, తుమ్మల వెంకట్‌రెడ్డి, కోడితాల నాగరాజు, మర్రి వెంకటేశం, ప్రశాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

నకిరేకల్: షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని వీటీ కాలనీకి చెందిన కల్లు సుదర్శన్‌రెడ్డి ఇంట్లో నాలుగు పోర్షన్‌లు ఉన్నాయి. ఒక పోర్షన్‌లో ఆయన ఉంటుండగా.. మరో మూడు పోర్షన్‌లు అద్దెకు ఇచ్చాడు. మధ్య పోర్షన్‌లో స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పజ్జు కృష్ణ అద్దెకు ఉంటున్నాడు. రోజుమాదిరిగా మంగళవారం కృష్ణ స్కూల్‌కు వెళ్లాడు. అతడి భార్య, ఇద్దరు కుమార్తెలు కనగల్ మండలం దర్వేశిపురం గ్రామానికి వెళ్లారు. అతడి తల్లి సైదమ్మ ఇంట్లోని ముందు గదిలో ఉంది. మధ్యాహ్నం 2గంటల సమయంలో వంట గదిలో షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపించాయి. ఇంట్లోని రెండు గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకున్నాయి. ఇల్లంతా పొగతో నిండిపోయింది. ముందు గదిలో తలుపులు వేసుకుని ఉన్న కృష్ణ తల్లి సైదమ్మ ఇది గమనించలేదు. చుట్టుపక్కల వారు పొగలు వస్తుండటం చూసి ఇంట్లోకి వెళ్లి కృష్ణ తల్లి సైదమ్మను బయటకు తీసుకొచ్చారు. స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి కాలిబూడిదయ్యాయి. పక్క ఉన్న మరో రెండు పోర్షన్‌లకు పొగలు వ్యాపించాయి. వారు కూడా ఆ సమయంలో ఇళ్లలో లేరు. నాలుగు క్వింటాళ్ల బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు, వస్తువులు మంటల్లో కాలిపోయాయి. బీరువాలో ఉన్న తన కుమార్తెల విద్యార్హత సర్టిఫికెట్లు సైతం కాలిపోయాయని, సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. ఫైర్ సిబ్బంది రావడం ఆలస్యం అయితే సిలిండర్లు పేలిపెను ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు. తహసీల్దార్ జమురుద్దీన్, ఆర్‌ఐ చిరంజీవి, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ నేత దైద రవీందర్, స్థానిక కౌన్సిలర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వేముల వీరేశం భార్య పుష్ప బియ్యం, కొంత ఆర్థికసాయం అందజేశారు. వారికి అవసరమైన నిత్యావసర సరుకులను మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ సమకూర్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం

డిండి: జడ్చర్ల–కోదాడ హైవేపై డిండి మండల పరిధిలోని ఎర్రగుంటపల్లి గ్రామ స్టేజీ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణానికి చెందిన కాసుల అరవింద్‌చారి(31), చేపూరి కార్తీక్‌చారి(35) మంగళవారం బైక్‌పై పని నిమిత్తం దేవరకొండకు వచ్చారు. పని పూర్తిచేసుకుని రాత్రి తిరిగి కల్వకుర్తికి వెళ్తుండగా.. డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టడంతో కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో అరవింద్‌చారి, కార్తీక్‌చారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజు తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

నాంపల్లి: బైక్ అదుపుతప్పి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నాంపల్లి మండలం చిట్టంపహాడ్ శివారులో సోమవారం రాత్రి జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడెం మండల కేంద్రానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు(27) నాంపల్లిలోని లక్కీ వైన్స్ పర్మిట్ రూమ్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకొని బైక్‌పై మర్రిగూడేనికి వెళ్తుండగా.. చిట్టంపహాడ్ శివారులో బైక్ అదుపుతప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.

- కల్టివేటరే ట్రాలీగా..



భువనగిరి మండలం వీరవల్లి గ్రామానికి చెందిన రైతు స్టానిస్లాస్ తన పొలంలో పండించిన వంకాయలను ట్రాక్టర్ కల్టివేటర్‌పై పెట్టుకుని ప్రతిరోజు భువనగిరి రైతు బజార్‌కు తీసుకొస్తున్నాడు. ఆటోలో తీసుకొస్తే రూ.500 నుంచి రూ.800 వరకు కిరాయి చెల్లించాల్సి వస్తుందని, కల్టివేటర్ పైనే కవర్ కప్పి ట్రాలీగా మార్చుకున్నట్లు ఆయన పేర్కొన్నాడు. – భువనగిరిటౌన్

మెడికల్ క్యాంపునకు వెళ్లొచ్చి.. అస్వస్థతకు గురై వ్యక్తి మృతి



సైదులు (ఫైల్)

శాలిగౌరారం: మెడికల్ క్యాంపునకు వెళ్లొచ్చిన వ్యక్తి మరుసటి రోజే అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన శాలిగౌరారం మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన గుడిపాటి సైదులు(61) వ్యవసాయంతో పాటు కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రస్తుతం శాలిలింగోటం సమీపంలోని ఓ రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని జీడిమెట్ల సూరారం ప్రాంతానికి చెందిన ఓ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి సైదులు హాజరయ్యాడు. అనారోగ్య సమస్యలున్న వారిని గుర్తించి హైదరాబాద్‌లోని తమ హాస్పిటల్‌కు తీసుకెళ్లి మెరుగైన వైద్యసేలందించేలా వైద్యులు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా ఈ నెల 9న శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెంతో పాటు ఇతర గ్రామాలకు చెందిన 46 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. సైదులు కూడా వెళ్లాడు. అక్కడ చికిత్స పొందిన తర్వాత సైదులుతో పాటు మరో 30మంది ఆదివారం స్వగ్రామాలకు వచ్చారు. సోమవారం సైదులు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

- మూడు బైక్‌లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ మధు

గుర్రంపోడు: జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాల్పడుతున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం ఆరెగూడెంలోని తిరుమలనాథస్వామి ఆలయంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి హుండీ పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యుడు మారం రాంరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఆమలూరు బస్ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కొప్పోలు గ్రామానికి చెందిన మామిడి వెంకటేశ్, కొత్త సాయి, మరో ఇద్దరు మైనర్లు నంబర్ ప్లేట్లు లేని మూడు బైక్‌లపై వెళ్తుండగా.. వారిని పట్టుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి మూడు బైక్‌లతో పాటు రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ మధు, కానిస్టేబుళ్లు కావలి నర్సింహ, నాగరాజు, సత్యనారాయణ, సైదులు దేవరకొండ ఏఎస్పీ మౌనిక, మల్లేపల్లి సీఐ రాజు అభినందించారు.

వాహనాలు నడిపేటప్పుడు కుటుంబాన్ని గుర్తుచేసుకోవాలి



మతిస్థిమితం లేని వ్యక్తికి కటింగ్ చేస్తున్న సినీ నటుడు బాబూమోహన్



అనాథాశ్రమంలో భోజనం వడ్డిస్తున్న బాబూమోహన్

- సినీ నటుడు బాబూమోహన్

చౌటుప్పల్: యువత వాహనాలు నడిపేటప్పుడు తమ కుటుంబాన్ని గుర్తుచేసుకోవాలని సినీ నటుడు, మాజీ మంత్రి బాబూమోహన్ సూచించారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని అమ్మానాన్న అనాథాశ్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆశ్రమంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి భోజనం వడ్డించారు. మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తికి జుట్టు కత్తిరించారు. అనాథలతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు ఒక్క క్షణం ఆలోచన చేయక పోవడం మూలంగా చోటుచేసుకునే ఘటనలతో జీవింతాం క్షోభ అనుభవించాల్సి వస్తుందన్నారు. తాము సరైన పద్ధతిలో వెళ్తే సరిపోదని, ఎదుటి వ్యక్తులు సైతం సరైన పద్ధతిలో వస్తేనే ప్రమాదాలు జరగవన్నారు. గతంలో తన కుమారుడు ఓ పాపను తప్పించే క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయాడని గుర్తుచేసుకున్నారు. అనాథలకు సేవ చేసే భాగ్యం ఊరికనే రాదని, భగవంతుడు సంకల్పిస్తేనే అది సాధ్యమవుతుందన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు అనాథలకు సేవలందించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమ్మ నాన్న అనాథాశ్రమాన్ని సందర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పేదలు, అనాథలు, అభాగ్యులకు సేవ చేస్తే ఎంతగానో సంతృప్తినిస్తుందన్నారు. తాను కూడా తన కుమారుడైన పవన్ బాబూమోహన్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ఆశ్రమ నిర్వాహకుడు గట్టు శంకర్, పవన్ బాబూమోహన్ ట్రస్ట్ ప్రతినిధి రాజ్‌కుమార్, ఆశ్రమ ప్రతినిధులు గట్టు శ్రావణి, గట్టు శ్రావణ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మృతురాలి బంధువుల ధర్నా

- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ
- మల్లేశ్వరీ అంత్యక్రియలు పూర్తి



జడ్చర్ల–కోదాడ హైవేపై ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు

నిడమనూరు: ప్రేమించిన వ్యక్తి మరొకరిని పెళ్లి చేసుకోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన దళిత యువతి మల్లేశ్వరీ(27) కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు మంగళవారం రెండోరోజు కూడా నిరసన చేపట్టారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో హాస్టల్‌లో ఉంటూ నిమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న మల్లేశ్వరీ, బొక్కమంతపహాడ్ గ్రామానికే చెందిన కుక్కల జాన్‌రెడ్డి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల జాన్‌రెడ్డి మరో యువతిని వివాహం చేసుకోవడంతో మనస్తాపానికి గురైన మల్లేశ్వరీ సోమవారం తాను ఉంటున్న హాస్టల్‌లోనే ఆత్మహత్య చేసుకుంది. పోస్టుమార్టం అనంతరం సోమవారం రాత్రి మల్లేశ్వరీ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన బంధువులు, కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని జడ్చర్ల–కోదాడ హైవేపై ధర్నా చేపట్టారు. పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాత్రి ధర్నా విరమించారు. తిరిగి మంగళవారం ఉదయం కుక్కల జాన్‌రెడ్డి ఇంటి వద్ద మల్లేశ్వరీ మృతదేహాన్ని ఉంచి రహదారిపై ధర్నా చేశారు. జాన్‌రెడ్డి, మల్లేశ్వరీ కలిసి ఉన్న ఫొటోలు, చాటింగ్ స్క్రీన్ షాట్‌లతో పాటు నగదు బదిలీకి సంబంధించిన వివరాలను యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు అందించారు. జాన్‌రెడ్డి కుటుంబ సభ్యులు, మరికొందరు మానసికంగా వేధించడంతోనే మల్లేశ్వరీ ఆత్మహత్యకు పాల్పడిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు యువతి కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. దీంతో మంగళవారం సాయంత్రం మల్లేశ్వరీ అంత్యక్రియలు నిర్వహించారు. నిడమనూరు ఎస్‌ఐ సురేష్, సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో బొక్కమంతలపహాడ్‌లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహిళలు సమానత్వం సాధించాలి



సూర్యాపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

సూర్యాపేట అర్బన్: మహిళలు అన్ని రంగాల్లో సామాజిక సమానత్వం సాధించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఐద్వా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పూలే, అంబేద్కర్ యాదిలో.. మహిళ హక్కుల పరిరక్షణ యాత్ర మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమై రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ యాత్రకు ఐద్వా సూర్యాపేట జిల్లా కమిటీ, ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కేవీపీఎస్ సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి రైతు బజార్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. మహిళలు, విద్యార్థులపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలో మాదిరిగా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్ఠం చేసి 16 రకాల నిత్యావసర సరుకులు అందించాలన్నారు. కులాంతర వివాహితులకు రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగేళ్ల వెంకటచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శిలు ఆశలత, భారతి, షబానా, స్వరూప, నర్మద, ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి, ఐద్వా జిల్లా నాయకురాలు పిండిగా నాగమణి, షేక్ ఖాజాబీ, రమాదేవి, చెరుకు ఏకలక్ష్మి, కొప్పుల రజిత, సజన, మంగమ్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ములకలపల్లి రాములు, సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్, ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం జిల్లా కన్వీనర్ జిల్లపల్లి నరసింహారావు, ప్రజానాట్యమడలి జిల్లా కార్యదర్శి వేల్పుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు

- గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదర్శ్ సూచనలు



డి. ఆదర్శ్, కేవీకే శాస్త్రవేత్త

గరిడేపల్లి: వేసవిలో అడపాదడపా కురిసే వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకొని దుక్కులు దున్నుకోవాలని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి. ఆదర్శ్ సూచిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో రైతులు వానాకాలం లేదా యాసంగి పంట తర్వాత మళ్లీ వర్షాకాలం వరకు భూమిని దున్నకుండా వదిలేయడం వల్ల కలుపు మొక్కలు పెరిగి భూమిలో సత్తువ లేకుండా చేస్తాయని, దీని వల్ల భూసారం తగ్గడమే కాకుండా నీరు భూమి లోపల పొరల నుంచి ఆవిరైపోతుందని ఆయన పేర్కొన్నారు. వేసవి దుక్కులపై ఆయన సలహాలు, సూచనలు..

యాసంగి పంటకోత అనంతరం పొలాన్ని అలా వదిలేయకుండా వర్షాలకు ముందే భూమిని దున్నటం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతు దుక్కుల వల్ల భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా చేయడం వల్ల భూమిలో తేమ శాతం పెరిగి భూసారం అభివృద్ధి చెందుతుంది. అంతేకాకుండా చీడపీడలు, తెగుళ్లు, కలుపు వంటి వాటిని నివారించవచ్చు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

భూసారం అభివృద్ధి, తేమ శాతం పెరుగుదలలో కీలకపాత్ర...

వేసవి దుక్కులు లోతుగా వాలుకు అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవటం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో పాటు భూమి ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకొనే సామర్థ్యం పెరుగుతుంది. దీని ప్రభావం పంట దిగుబడి మీద కూడా కేంద్రీకృతమవుతుంది. వేసవి దుక్కులు దున్నేముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలను తోలటం వలన అవి విసర్జించే వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రీయ ఎరువుగా తయారై భూసారం అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయి. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, కంపోస్టు ఎరువు, చెరువు మట్టిని వెదజల్లుటం వల్ల నేల సారవంతమై పంట దిగుబడి పెరగడంతో పాటు తేమశాతం పెరుగుతుంది. సాధారణంగా రైతులు పంట చేతికందగానే పంటల నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్తాచెదారం కాల్చివేయకుండా అవకాశమున్న వారు లోతు దుక్కులు చేయటం వల్ల పంట చెత్తాచెదారం, ఎండు ఆకులు నేల పొరల్లో కలిసిపోయి కుళ్లిపోయి ఎరువుగా మారి పంటకు కావల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి.

పురుగులు, తెగుళ్ల నివారణకు దోహదం..

వేసవి కాలంలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు నిద్రావస్థ దశలో చెత్తాచెదారంలో, కొయ్యల కాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు మొదలైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవిలో లోతు దుక్కుల వల్ల నిద్రావస్థ దశలో భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు, లార్వాలు, ప్యూపాలను పక్షులు, కొంగలు తిని నాశనం చేస్తాయి. అదేవిధంగా వేసవి దుక్కుల వల్ల భూమి లోపల పొరల్లో ఉన్న శిలీంధ్ర బీజాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. అవి అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధి కలుగజేసే శక్తిని కోల్పోతాయి.

కలుపు నిర్మూలన సులభం

సాధారణంగా పంటలేని సమయంలో భూమిలో కలుపు మొక్కలు పెరుగుతాయి. ఈ కలుపు మొక్కలు నేలలోని నీరు, పోషకాలను ప్రత్యక్షంగా గ్రహించి పంట దిగుబడిని తగ్గిస్తాయి. అదేవిధంగా అనేక రకాల పురుగులకు, శిలీంధ్రాలకు ఆశ్రయాన్ని కల్పించటం ద్వారా పరోక్షంగా పంట నష్టానికి కారణమవుతాయి. కాబట్టి వేసవిలో లోతు దుక్కుల వల్ల లోతుకు పాతుకుపోయిన కలుపు మొక్కలు నేల పైపొరల్లోకి చేరటం వల్ల అధిక ఉష్ణోగ్రతకు అవి నశిస్తాయి. దీని వల్ల తదుపరి పంటలో కలుపు తాకిడి తక్కువగా ఉంటుంది.